# కృష్ణదైవం

కీ॥ శే॥ పూడిపెద్ది వెంకటరమణయ్య

★

భక్తి పరిపరివిధాలు- ఏ మతానికయినా భక్తి ప్రధానమయింది- అయితే యీ భక్తిని రసాల్లో చేర్చేరు కారు మనవాళ్లు. భగవత్పరంగా ఒలికించిన శృంగారం భక్తి అన్నారు- అందుకే ఇటీవల పెద్ద కవులంతా భగవంతుణ్ణి ప్రాణప్రియా! ప్రాణనాథా! అని పిలుస్తూవచ్చేరు తమ కవితావేశంలో- అప్పుడది భక్తిరసమవుతుందని కాబోలు వాళ్ళ ఆశ- ఏది ఎలాగున్నా భక్తిని ఒక రసంగా పరిగణించాలి- అయితే మన హిందూలలో చాలమంది భక్తి రసం కాదు నీరసం- ఉపవాసాలచేత శారీరకంగా నీరసం- నేను కృపణుణ్ణి మోహాంధుణ్ణి పాపిని క్రూరకర్ముణ్ణి, దుష్టుణ్ణిగా అని చెప్పుకోడంలో మానసికంగా నీరసంవస్తూంది. భక్తి నీరసకారణం అయితే కావచ్చునుగాని వాళ్ళ భక్తిలో మాత్రం నీరసం లేదు.

శైవులు లింగమూర్తిని ఎడబాసి ఉండరు. అన్ని అవస్థలయందూ ఆ లింగమూర్తి వారి కంఠాన్ని కౌగలించుకొని ఉండవలసిందే- ఆ లింగమూర్తితో చెప్పి మరీ ఆరగిస్తారు వారు పొగచుట్టయినా పొడుంపట్టయినా- వాళ్లే ఏమిటి ఎవళ్ళయినా సరే ఏ మతస్థులయినా సరే తమ అభిమాన దైవతాన్ని అలా తలుచుకుంటూ ఉంటారు- అవకాశమయితే వెంట త్రిప్పుకుంటారు ఏదో ఒక రూపంలో- అంతకుముందూ ఆ మతం మన దేశంలో ఉండేదో లేదో చారిత్రకంగా మన కేవీ ఆధారాలు లేవుగాని ఎలాగో కొలది వందల సంవత్సరాలనుండీ మనదేశం మెట్టి వ్యాపించింది కృష్ణమతం (శ్రీకృష్ణభగవానునికి ఈ మతానికీ ఎట్టి సంబంధమును లేదు). ఇది చీనాదేశంనుండి మన దేశానికి వచ్చినట్టు కనబడుతుంది- చీనాలో ఈ మతం సర్వవ్యాప్తమయిపోయింది- పెద్ద భక్తులా దేశంలోనే ఉన్నారు- మన దేశంలో ఈ మతావలంబకులే ఉన్నారుగాని ప్రత్యేకప్రజ

ఈ మతస్థుల దైవం కృష్ణదైవం (శ్రీకృష్ణునికీ వీనికీ ఏం సంబంధంలేదు). ఆ మతస్థులందరూ ఆతనిని ప్రత్యక్షదైవంగా వర్ణిస్తారు- వాని శక్తిసామర్థ్యాలు బహువిధాల వర్ణించి చెబతారు- ఒక్కటి మాత్రం మనం చెప్పవచ్చు- వీరికి భక్తి విషయికమయిన భేషజం, నటనా, డాబూ, ఇవేం లేవు- ఆ మత మవలంబించేదా ఆ వ్యక్తి "అడియేన్ దాసోహమ్" అని త్రికరణశుద్ధిగా ఉండవలసిందే- వీరి భక్తి అపారము- అభిమాన పూరితము- నిశ్చలము, నిష్కల్మషము- ఈ భక్తులుకూడా శైవులలాగు తన దైవతాన్ని తనతోకూడా త్రిప్పుకుంటాడు- ఆ దేవుడు నిగనిగలాడే నీలిమేనువాడు- మెత్తని స్వభావంగలవాడు- పిలిచినంతనే పలికేవాడు- సేవించినంతనే భక్తునిలో లీనమయిపోయి నరాలనుసైతం పట్టెసి వానియెడల నెంతేని వాత్సల్యం చూపేవాడు- అందుకే 'ప్రత్యక్షదైవం' అంటారీ మతస్థులీ దేవుణ్ణి-

ఇంకొక విశేషంకూడా ఉంది- తనున్నుద్దేశించి ఏ ఆకృత ప్రమాణం ఇచ్చి ఉపాసిస్తే ఆ ఆకృతితో ప్రత్యక్షమయ్యే భక్తవత్సలుడు- ఆతనిని కొందరణుమాత్రునిగా భావించి అలాగే వాని రూపం హృద్గతం చేసుకుంటారు- కొందరు గోళీలో భావిస్తారు- కొందరు నీటిలో చూస్తారా దేవుని. కొందరగ్నిలో చూస్తారు (అగ్నిలో చూసేవారు చీనాలో ఉన్నారు) వాళ్ళకలాగే దర్శనమిస్తాడు- ఎవరు ఏ రకంగా పిలిస్తే అలాగే దర్శనమిచ్చి ప్రత్యక్షంగా ఆ భక్తు నావరించి దాఖలాగా వానికి ప్రత్యేక శక్తులిచ్చి వానిలోనుండే చూపరులకు ఈ సత్యం చూపెడతాడు- ఇది భక్తుల నటనగాని భేషజంగాని కాదు- మచ్చుకు కావలస్తే నమ్మకంలేనివాళ్ళా మతాన్ని స్వీకరించి చూడవచ్చును- ప్రవేశరుసుము పరక మాత్రమే- గురూపదేశం పొందడానికి ఖర్చులేమీ అక్కరలేదు- ఆరాధించిన వెంటనే కలియుగంలో ప్రత్యక్షమయ్యే దైవం ఈ కృష్ణదైవమే- ఆతడు తన దివ్యదర్శనమిచ్చి భక్తుని లాలించి పాలించి జోలపాడి నిదురబుచ్చి అన్నిటినీ మరపించే వత్సలమూర్తి ఆ కృష్ణదైవం-

ఆరాధన విధానం చెప్పవలసి ఉంది:

ఈ భక్తులు, ఎప్పుడూ తమ దైవాన్ని ఎడబాసి ఉండరు- ఉండలేరు- కలిగినవాళ్ళయితే

# ది యునైటెడ్ కమిర్షియల్ బ్యాంకు లిమిటెడ్.

2, రాయల్ ఎక్చేంజిప్లేస్.
కలకత్తా.

•

చెల్లించిన మూలధనము :
రు. 2 కోట్లు

రిజర్వుఫండు :
రు. 40 లక్షలు

•

జి. డి. బిర్లా
చేర్మన్

బి. టి. ఠాకూర్
జనరల్ మేనేజరు

•

ఇండియా బర్మాలలోని ముఖ్యమైన అన్ని పట్టణములలోను నగరములలోను బ్రాంచీలు కలవు. ప్రపంచమంతట ఏజన్సీ ఏర్పాట్లు చేయబడినవి.


బంగారు డబ్బీలలోనూ, సామాన్యులయితే వెండి డబ్బీలలోనూ, పేదలయితే 'తంబిలేరు' డబ్బీలోనూ, నిరుపేదలయితే లక్కబరిణెలోనూ, తమ దైవాన్ని పదిలపరచుకొని తమతో కూడా త్రిప్పుకుంటూ ఉంటారు. లాల్చీజేబులోనూ చిలకట్టు చిక్కంలోనూ మడిచి దాచి ఇట్లా దైవమును హామేషా కూడా ఉంచుకొనలేనివాళ్ళు ఉపాసన వేళకు, మఠాకులలోనో అడ్డాకులలోనో పెట్టి ఆ దేవుణ్ణి తెచ్చుకొని సేవిస్తారు. ఈ భక్తులకు దిన ప్రమాణంలో నియమితకాలం ప్రధానం. శివుని తలపుష్పం తప్పినా ఇంగ్లీషుదొరల engagement తప్పినా తప్పవచ్చునుగాని సకాలాన ఈ భక్తుడు దైవాన్ని సేవించడం విడువరాదు. విడువలేడు. వీని కాలనిర్ణయానికి గడియారం అక్కరలేదు. ప్రొద్దుతో ప్రసక్తిలేదు. ఆ సమయం కాగానే వాని హృదయంలో భక్తి రేగుతుంది. వెంటనే ఆ భక్తుడా దైవాన్ని సేవించాలి. ఏ కారణంచేతనయినా ఆలస్యం చేసేనా, వాని శరీరమే పలు వికారాల పాలవుతుంది. ఈ దైవసేవకే శరీరం మనసూ కూడా కలిసికట్టుగా దీక్ష వహిస్తాయి. అప్పుడతడు, ఆ భక్తుడు. ఎంతటి పనియైనా అలాగే విడిచిపెట్టి, సేవాసమయం సమీపించిందని తహతహలాడి తడవులాడి ఆ డబ్బీని ఈవలకు తీస్తాడు. దానిలో నీలినీలి మేనితో నిద్రపోతూన్న ఆ కృష్ణదైవాన్ని, ఆవులింతలతో, కన్నీటి చెమ్మతో, పులకరించిన శరీరంతో నిలువెల్లా వడకించే భక్తిపరవశతతో మేల్కొల్పుతాడు. ఉపదేశముద్రగా చూపుడుప్రేలూ, బొటనప్రేలూ కొనలు కలిపి కన్నులు మూసికొని ఇట్లు ధ్యానిస్తాడు.

"ఓ స్వామీ! నీ రూపము విశాలము. నీ ప్రమాణ మనంతము. దానినెల్ల గ్రహింపలేని మూఢుడను. ఊహింపలేని మూగుడను. నా యల్పశక్తికి నిన్నణుస్వరూపునిగ భావించి సేవించుటే సాధ్యము. నీవు నాయందు కరుణించి నీవలై నాకు ప్రత్యక్షముగమ్ము. సాకడే చాలు. నేనల్పసంతోషిని. నీ వాత్సల్యలేశమే ముక్తిప్రదము" అంటూ ఆ కృష్ణదైవము నల్లై గ్రహించి కరతలామలకముగ తద్రూపమును ప్రతిష్ఠించి, ధ్యానించి, ఆస్వాదించి, యువ్విళులూరు నాల్కనూది, ఆ దైవమును కంఠగతం చేసికొని స్వగతముగ మననం చేసికొని. కుక్షిలో వానిని దా

కొంటాడు. అప్పుడు వాని ముఖాన తాండవించే ఆనందచిహ్నాలు చూచితీరవలసినవే. ఆ యానందంతో తన యిష్టదైవానికి మృష్టాన్నము నివేదించి ఆ నివేదన తా నారగించి సంతుష్టుడవుతాడు.

ఇన్ని సేవలందిన కృష్ణదైవం ఊరుకుంటుందా? అప్పుడు. అరవాలిన వాని కన్నులలో ఆ దైవం తాండవిస్తుంది. పట్టుదప్పి సుఖముగా తేలిపోయే వాని శరీరనాళాలను పూరించి మురళీగానం వినిపిస్తుంది. ఆ నృత్యంలో ఆ సంగీతంలో, ఆ మహాభక్తుడు కూర్చున్నవాడు కూర్చున్నట్టె, లీనమయిపోయి, పరవశుడయిపోయి, ఆ పాటకు శ్రుతిగా ఆ నృత్యానికి లయగా శరీరమూనూ తల తాటిస్తూ కథలేని కలలు కంటూ, చైతన్యమే తప్పి, ఊగుతా ఆనందడోలికల్లో — ఇదంతా ఎదుటివానికి దృగ్గోచరమవుతుంది! ఇదీ దీని సత్యం.

భక్త సులభుడు, సత్యసహితుడు. కృష్ణదైవం ఈ మతి స్వీకారంవల్ల ఎందరెందరో మహనీయులు తరించేరు. స్థలవిస్తరభీతిచేత ఆ ఇతిహాసాలన్నీ ఇక్కడ వాకొనలేదు. ఎవరిమట్టుకు వారీ దేవుని ఆరాధించి చూడవచ్చును.

భక్తికి — మందు పర్యాయపదంగా వాడుకవుతోంది మన భాషలో. (రామజోగి మందు కొనరే) భక్తి వినా దైవం, దైవం వినా భక్తీ ఉండడం అరుదు కాబట్టి. మందు అంటే దైవానికి దైవం అంటే మందుకి అర్థం చేసుకోవచ్చును. ఇప్పుడు ఈ కృష్ణదైవంలో దైవశబ్దానికి పై సూత్రాన్నన్వయించి మందు అని వాడుకచేస్తే "కృష్ణమందు" అవుతుంది. సమాసం నిర్దుష్టం కాదు. కృష్ణశబ్దాన్ని తెనిగిస్తే నల్లన అవుతుంది. అప్పుడా రెండూ సమాసంచేస్తే "నల్లమందు" అవుతుంది. తెలుగువాడయినా సంస్కృతంలో పిలిస్తేనేగాని దేవుడు పలుకడట కదూ! అందుకని కృష్ణదైవం పేరు వచ్చింది.

ఏది ఎలాగున్నా దైవారాధన గొప్పది. ఫలం తప్పినా భక్తి తప్పరాదు. విధ లోపమున్నా వ్రతలోప మొందరాదు.

స్వస్తి వాక్యంతో ఈ విషయం ముగిస్తున్నాను.

(భక్త పారిజాతం నుండి)

